మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

రామంతాపూర్: మూసీ నది ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని పేదల ఇళ్లు కూల్చివేసి రిసార్టులు, వాణిజ్య భవనాలు నిర్మిస్తామంటే తమ పార్టీ తీవ్రంగా అడ్డుకుంటుందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఎన్‌వీ.సుభాష్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు శనివారం రాత్రి రామంతాపూర్ మూసీ బఫర్‌జోన్‌లో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఒక రోజు నిద్ర కోసం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూసీ బఫర్‌జోన్‌లోని పేదల ఇళ్లు కూల్చివేయకుండా మూసీ ప్రక్షాళన చేయవచ్చని మూసీ ఇరువైపులా రిటైలింగ్ వాళ్లను నిర్మించి మురుగు శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసి మురుగు మూసీలోకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా మూసీ ప్రక్షాళన చేసే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బాల చందర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, బీజేపీ అధ్యక్షులు బండారు వెంకట్‌రావు, కేంద్ర సెన్సార్ బోర్డు మెంబర్ ముత్తినేని జగదీష్, నారాయణ, దాస్‌కుమార్, దయాకర్‌రెడ్డి, సుధాకర్, రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


ఎస్పీనగర్ బస్తీ వాసులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ సర్దార్ పటేల్ నగర్ బస్తీలో కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి పనులు పూర్తిచేసి అసోసియేషన్‌కు అప్పగించాలని డీఈ మహేష్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యతలోపం లేకుండా చూడాలన్నారు. రోడ్ల మీద నీళ్లు నిలవకుండా చూడాలని, మ్యాన్ హోల్స్ మరమ్మతులతో పాటు నాలాల డీసిల్టింగ్ క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. ఏఈ నవీన్, వీఐ రమేష్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, శ్రీకాంత్ సులోచన పాల్గొన్నారు.

ఖోఖోలో జాతీయ పోటీలకు ఎంపిక

మల్లాపూర్: మల్లాపూర్ సూర్యనగర్‌లోని మోడ్రన్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థిని సుప్రియ ఖో,ఖో పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం స్కూల్ చైర్మన్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో సుప్రియను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ జోన్ నుంచి ఖో,ఖో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేస్తూ ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఉప్పల్‌జోన్ సెక్రటరీ పద్మావతి, స్కూల్ కరెస్పాండెంట్ సచిదేవి, హెచ్‌ఎం. లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థిని సుప్రియను సత్కరిస్తున్న దృశ్యం

సీసీరోడ్డు పనుల పరిశీలన


ఎస్పీనగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ ఎస్పీనగర్ కాలనీలో సీఎం నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం ఎస్పీనగర్ కాలనీ అధ్యక్షుడు నెమలి రవికుమార్, కాంగ్రెస్ నేతలు అనిల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందించేందుకు పనిచేస్తోందని, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి కృషి ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, కాంట్రాక్టర్ సదానంద్, రాజేష్, శ్రీనివాస్, యాదగిరి, కిషోర్, గాంధీ, హరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ శనివారం జలమండలి జీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణపనులు భూగర్భ డ్రైనేజీ సరిగ్గా లేకపోవడం వల్ల ఆగిపోయాయని వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. భవానీనగర్ వీధి నెంబర్-3, వీఎస్‌టీ కాలనీలోని వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరైనా శంకుస్థాపన చేశామని, భూగర్భ డ్రైనేజీ సమస్యల వల్ల రోడ్డు పనులు చేపట్టలేకపోతున్నామని, వెంటనే రెండు వీధుల్లోని భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి


మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానిక నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ 19వ డివిజన్ ఇన్‌చార్జ్ బొమ్మక్ శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి హరినాథ్‌రెడ్డి శనివారం మేయర్ అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం దివంగత ఎన్టీఆర్ విగ్రహం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారిందని, విగ్రహాన్ని రోడ్డు మధ్యలో పెట్టి కాలనీవాసులు, ప్రయాణికులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

ప్రారంభమైన 'గ్రేట్ బాంబే సర్కస్'

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి చెంగిచెర్ల ఎక్స్‌రోడ్డులో క్రోమా జి.టి.సిగ్నోడియా మైదానంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇథియోపియన్, ఆఫ్రికన్, చైనీస్, రష్యన్ కళాకారులతో దేశంలోనే మొదటిసారిగా 'గ్రేట్ బాంబే సర్కస్'ను శనివారం ప్రారంభించారు. ఈ సర్కస్ ఈనెల 16 నుంచి డిసెంబర్ 16 వరకు నెలరోజుల పాటు జరగనుందని నిర్వాహకులు ప్రకటించారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.00 గంటలకు, తిరిగి రాత్రి 7.00 గంటలకు సర్కస్‌షోలు ఉంటాయని తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 7700020987, 9711456500,9633780878 అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు.


సర్కస్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పేదలకు అండగా ఉంటాం

రామంతాపూర్: మూసీ బఫర్‌జోన్‌లోని ఇళ్లను మూసీ సుందరీకరణ పేరుతో కూల్చడానికి ప్రయత్నిస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాల చేస్తామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీ ఎస్ఎస్.ప్రభాకర్ హెచ్చరించారు. శనివారం రామంతాపూర్‌లోని మూసీ బఫర్ జోన్‌లో బీజేపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఆయన పరివాహక ప్రాంతాల్లో పర్యటించి నిద్రకు ఉపక్రమించారు. బీజేపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.


స్థానికులతో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కాప్రా: మహిళాభవన్ పురోగతి పనులు స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పవన్, జగన్, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రకృతితో మమేకం కార్తీకమాసం

● జోరుగా వన భోజనాల సందడి ● విశేష ఫలితం ఉంటుందన్న పండితులు

కార్తీకమాసం సందర్భంగా నియోజకవర్గంలో పలు ఆలయాల్లో దీపారాధనలు, సామూహిక సత్యనారాయణవ్రతాలు ప్రత్యేక పూజలతో శివకేశవుల నామస్మరణతో మార్మోగిపోతున్నాయి. ప్రతి ఏటా ప్రజలు తమ కుటుంబం, స్నేహితులతో పాటు పలు కుల సంఘాలు నిర్వహించుకునే వన భోజనాలు ఈసారి కూడా ప్రారంభమయ్యాయి.

– రామంతాపూర్


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)

ఈ సందర్భంగా వన భోజనాల గురించి వేద పండితుల నుంచి సేకరించిన వివరాలు...

వన భోజనాలు ప్రకృతి, వృక్షాలతో ఉన్న బంధాన్ని గుర్తు చేసే రోజని పూర్వకాలం నుంచి 'వృక్షో రక్షిత రక్షః' అంటే వృక్షాలను మనం రక్షిస్తే అవి స్వచ్ఛమైన ప్రాణవాయువును ఇచ్చి మనల్ని కాపాడుతాయ పండితులు చెబుతున్నారు.

◆ పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వన భోజనాల్లో అంతర్లీనంగా దాగి ఉందని వివరిస్తున్నారు.

కార్తీక పురాణం ప్రకారం..

కార్తీక మాసంలో చెట్టుతో ఉన్న వనంలో సాక్షాత్తు విష్ణుమూర్తి విహరిస్తారని, ఆ చెట్టు నీడన విష్ణుమూర్తికి పంచ భక్ష పరమాన్నాలతో నివేదించి బంధుమిత్ర సపరివారంగా పూజిస్తే సమస్త పుణ్యక్షేత్రాల్లోని శ్రీ మహావిష్ణువు పూజించిన పుణ్యఫలం దక్కుతుందంటున్నారు. అదే విధంగా సకల పాపాలు తొలగిపోయి అధ్యాత్మిక భావనలు ఆరోగ్యం, ఆనందం కలుగుతాయని భక్తుల్లో విశ్వాసం ఉంది.

వన భోజనాలతో ప్రయోజనాలు...

వన భోజనాల్లో ప్రజలకు లభించే లాభాలను గమనిస్తే ఉసిరిచెట్టు నీడన భోజనం చేయడంలో మనుషులు ఆరోగ్యకరంగా ఉంటారని, ఉసిరిచెట్టు నుంచి వీచే గాలి కారణంగా శరీరంలో ఉన్న అనేక రుగ్మతలు తొలగిపోతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

◆ ప్రతి ఏటా కార్తీకమాసంలో ఉప్పల్ నియోజకవర్గంలోని పలు కుల సంఘాల రాజకీయ నేతలు, ప్రజలు, కుటుంబాలు తమ బంధుమిత్రులతో కలిసి వ్యవసాయ క్షేత్రాల్లో ఎక్కువగా వృక్షాలు ఉన్న ప్రాంతాల్లో ఆటపాటలతో అధ్యాత్మిక భావనలతో వన భోజనాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా వన భోజనాల సందడి ప్రారంభమైంది. ఈనెల 17న కీసర దయారాలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ తన వ్యవసాయ క్షేత్రంలో కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకుని వేద పండితులచే యజ్ఞోమాలు, గోమాతల సేవ, కార్తీక దీపారాధన, పంచభక్ష పరమాన్నాలతో వన భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు.


ఉప్పల్‌లో వన భోజనాలు (ఫైల్)

మహాభాగ్య నగర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో..

ఈనెల 24న ఘట్‌కేసర్ కొండాపూర్‌లోని మల్లారెడ్డి లక్ష్మమ్మ, వ్యవసాయక్షేత్రంలో వన భోజనాలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు మహాదేవభట్ల లక్ష్మణ్‌ప్రసాద్‌శర్మ ఓ ప్రకటనలో తెలిపారు.

పరమపవిత్రం కార్తీకమాసం..



దీపావళి అమావాస్య తర్వాత మొదలయ్యే కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ఇష్టమైన మాసం. ఈ మాసంలో సూర్య భగవానుడు తులారాశిలోకి ప్రవేశిస్తాడు. కార్తీకమాసంలో ఉదయం వేకువ జామున నిద్రలేచి చేసే స్నానాలు దీపారాధనలు ఉపవాస దీక్షలు విశేష ఫలితాలను ఇస్తాయి. ఆరోగ్యం, ఆనందం సిద్ధించే విధంగా శుభాలు జరుగుతాయి.

– పులిమామిడి నవీన్ ఆచార్య,
కట్టమైసమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రామంతాపూర్ : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలతో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. స్కూల్ సొసైటీ ఉపాధ్యక్షులు ఫయాజ్‌ఖాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

కాప్రా: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే కాప్రా సర్కిల్‌లో కొనసాగుతోంది. ఏఎస్ రావునగర్ డివిజన్ శ్రీనిలయం, సౌత్ కమలానగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను నోడల్ అధికారి సరోజ పరిశీలించారు. అధికారులు, సిబ్బంది దామోదర్, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లో అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారి పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, స్థానిక నేతలు, అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

కాప్రా: సుఖినోభవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కాప్రా డివిజన్ ఈశ్వరిపురికాలనీలో నైపుణ్యం ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందించారు. ఈ మిషన్లను ఏఎస్‌రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రభ, ప్రతినిధులు వెంకటరమణ, సునీత, వంజరి ప్రవీణ్ కరిపె, మాధవి, హారిక, సింగం రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అల్వాల్: వెంకటాపురం డివిజన్ ఇంద్రానగర్‌లో రూ.16 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, నాయకులు సయ్యద్ మోసిన్, షరీఫ్, తాజుద్దీన్, జందర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపనోత్సవాలు

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లోని నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ప్రారంభమై గురువారం 21న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సాయికిరణ్ ప్రకటించారు.

పోరాడితేనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం


సమావేశంలో పాల్గొన్న టీయూడబ్ల్యూఎఫ్ సభ్యులు

మల్కాజిగిరి: జర్నలిస్టుల సమస్యలు పోరాడితేనే పరిష్కారం అవుతాయని, టీయూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సలీమా అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన నియోజకవర్గ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా చేయూతను అందించాలన్నారు. మెడికల్ కార్డులు కూడా పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. అధ్యక్షుడిగా మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సత్య, కోశాధికారిగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా సాంబశివారెడ్డి, సుధాకర్, సహాయ కార్యదర్శులుగా వినోద్, సహదేవ్, దీపక్, సభ్యులుగా రమేష్, దుర్గాప్రసాద్, రాజుగౌడ్, ప్రశాంత్, ఎల్లగౌడ్, మహేందర్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు. నాయకులు పద్మారెడ్డి, హరిప్రసాద్, నర్సింహ, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

అల్వాల్: అల్వాల్ డివిజన్ ముత్యంరెడ్డినగర్‌లో పార్కు సుందరీకరణ పనుల్లో భాగంగా శనివారం కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులో అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పార్కు అభివృద్ధితో కాలనీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

రామంతాపూర్: శ్రీనగర్ కాలనీలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో 15 అడుగుల స్వామివారి విగ్రహ ఏర్పాటుకు శనివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, గతంలో బోనాల పండుగకు ప్రతిఏటా అమ్మవార్ల దేవాలయాలకు ఇచ్చే నిధులను కూడా రెట్టింపు చేశామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సందీప్, అనంతరావు, రాజమౌళి, రాజేందర్, పర్యాదరాజు, రాచమల్లు, వినయ్‌కుమార్, బ్రహ్మం, కాంగ్రెస్ నేతలు తోఫిక్, వినయ్ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

థీమ్‌పార్క్‌ను అభివృద్ధి చేయండి

కాప్రా: గత 8 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని థీమ్‌పార్క్‌ను పట్టించుకుని అందుబాటులోకి తీసుకురావాలని వైష్ణవి ఎన్‌క్లేవ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలపై వివరించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి తక్షణమే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ ఎస్‌ఆర్సీఎం కమేళా ఫీడర్ 33/11కేవీ చెంగిచెర్ల మండి ఏరియా పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ కమేళా ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా ఉండదని విద్యుత్ అధికారి ఏఈ హరినాథ్ సగ్గ ప్రకటించారు.

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గుబ్బలేన్, సెక్యూరిటీ లేన్, ఈఎస్‌ఐ ఆసుపత్రి, మధు ఇంజినీరింగ్ వర్క్స్, బాబా కంపెనీ తదితర ప్రాంతాల్లో ఉండదన్నారు.

మహిళ ఆత్మహత్య

ఉప్పల్: రాఘవేంద్రనగర్ కాలనీలో అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. హెచ్.రమేష్ వృత్తి రీత్యా మెకానిక్. కాగా అతడికి భార్య శశిరేఖ, కుమారుడు(10), కుమార్తె(6) ఉన్నారు. పనిలో భాగంగా బయలుదేరి వెళ్లాడు. శనివారం సాయంత్రం పక్కింటి వారు ఫోన్‌చేసి భార్య ఉరేసుకుందని చెప్పగా.. వెంటనే ఇంటికి వచ్చాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉందని, దీంతో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లో పటేల్ ఎన్‌క్లేవ్ కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేయాలని కోరుతూ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదరాజన్, హెచ్‌వీ.రావు, కేశవరెడ్డి, శామ్, యోహాన్ తదితరులున్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు


అభయాంజనేయ స్వామి దేవాలయంలో..

అల్వాల్: కార్తీకమాసం సందర్భంగా మంగాపురం కాలనీ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శివుడికి రుద్రాభిషేకం, కార్తీకదీపోత్సవం, లక్షార్చన, జ్వాలతోరణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జె.హన్మంత్‌రావు, కాలనీ అధ్యక్షులు రాకేష్‌రావు, కన్వీనర్ శ్రీనివాస్, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కరాటే పోటీలు

బోడుప్పల్: చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో ఆదివారం 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ నంద ప్రసాద్‌యాదవ్ వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన 300 మంది ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బొమ్మక్ కల్యాణ్‌కుమార్ హాజరవుతున్నట్లు వివరించారు.

